కిలకిల రావాలు..



వర్షాకాలంలో ఆశ్రయం పొందడానికి వేసవిలోనే పిచ్చుకలు గూళ్ల కట్టుకుంటాయి. ఒక చెట్టుకు ఐదు లేదా పది వరకు గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి. కానీ హుస్నాబాద్ పట్టణ శివారులోని శాతావాహన బీఈడీ కళాశాల సమీపంలో ఉన్న తాటి చెట్టుకు కొమ్మ కొమ్మకు లెక్కకు మించి పిచ్చుకలు గూళ్ల ఏర్పాటు చేసుకున్నాయి. పిచ్చుకల సందడితో ఉదయం వేళ అటుగా వెళ్లే వాకర్స్ కొత్త అనుభూతికి లోనవుతున్నారు.

- హుస్నాబాద్, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి బాలారిష్టాలు తప్పడం లేదు. ఒకేసారి మూడు నెలలకు సరిపడా సన్నబియ్యాన్ని పంపిణీ చేయాలని సర్కారు భావించింది. 20 రోజులు కావస్తున్నప్పటికీ ఈ ప్రక్రియ పూర్తికాలేదు. జిల్లాలోని గోదాముల్లో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ రేషన్ దుకాణాలకు చేరవేయడంలో జాప్యం చేశారు. ప్రణాళిక లోపం కారణంగానే పలుచోట్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. లబ్ధిదారులు సైతం తమ పనులను పక్కనబెట్టి బియ్యం కోసం పడిగాపులు పడుతున్న పరిస్థితి దాపురించింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 18



చేర్యాలలోని ఓ రేషన్‌షాపు ఎదుట క్యూలైన్

సన్న బియ్యం స్టాకు లేదట!

- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- ఆగుతూ..సాగుతున్న పంపిణీ
- జిల్లాలో 73 శాతం మాత్రమే సరఫరా
- ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే జాప్యం
- బియ్యం రాలేదని తిప్పిపంపుతున్న డీలర్లు
- సరైన ప్రణాళిక లేని అధికారులు

73 శాతమే పంపిణీ

జిల్లాలో 681 రేషన్ దుకాణాలకు సంబంధించి 2,98,985 కార్డులున్నాయి. ఇప్పటివరకు 2,19,990 కార్డులకు 10,640 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. ఇంకా 7,646 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది.

ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 73 శాతం కార్డులకు సన్నబియ్యాన్ని మాత్రమే పంపిణీ చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. కార్డుల పరంగా 27 శాతమే ఉన్నప్పటికీ బియ్యం నిల్వల పరంగా దాదాపు 40 శాతం వరకు పంపిణీ చేయాల్సి ఉంది. ఇంకా 78,995 కార్డులకు మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఇవ్వాల్సి ఉంది. త్వరగా పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించినప్పటికీ చాలా చోట్లా అలసత్వం అలుముకుంది. మరో 10 రోజులు గడిచినా పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేలా కనిపించట్లేదు.

బియ్యం సరఫరాలో జాప్యం..

జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల్లో 3 నెలలకు సరిపడా బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు ముందస్తుగా చెప్పుకొచ్చారు. కానీ రేషన్ దుకాణాల్లో స్టాకు లేదని డీలర్లు చెబుతున్నారు. గోదాముల్లో ఉన్న బియ్యాన్ని సమయానికి రేషన్ షాపులకు పంపించడంలో ఎందుకు జాప్యం చేశారో అర్థం కావడం లేదు. సర్కారు సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంపై విమర్శలు తలెత్తేలా వ్యవహరించారని పలుచోట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోదాముల నుంచి

మిగతా 8వ పేజీలో



నారాయణరావుపేట మండలం జక్కాపూర్ రేషన్‌షాపు వద్ద లబ్ధిదారుల పడిగాపులు

పాఠశాలల్లో యోగా తప్పనిసరి

- కలెక్టర్ హైమావతి

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 18: మానసిక, శారీర వికాసానికి యోగా పునాది అని, పాఠశాలల్లో యోగా సాధన తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. సిద్దిపేట యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ, భారత్ స్వాభిమాన ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా క్యాలెండర్‌ను, హరిద్వార్‌లోని పతాంజలి యోగ పీఠం ఆధ్వర్యంలో విద్యార్థులకు అర్థమయ్యేలా బొమ్మలతో కూడిన తెలుగు అనువాద పుస్తకాలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని పాఠశాలల్లో యోగా సాధన తప్పనిసరిగా చేయడానికి అధికారులను ఆదేశిస్తామని చెప్పారు. కార్యక్రమం లో ప్రముఖ యోగా గురువు తోట సతీష్, సం ఘాల ప్రతినిధులు తోట అశోక్, డాక్టర్ అరవిం ద్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, విక్రమ్ రెడ్డి, అంజయ్య, శ్రీనివాస్, చిప్ప ప్రభాకర్, కవిత, రఘువర్ధన్‌రెడ్డి, లక్కిరెడ్డి విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ దరఖాస్తును పరిష్కరించాలి

సిద్దిపేట అర్బన్: భూ సమస్యలపై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ హైమావతి అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లిలో భూ భారతి రెవెన్యూ అవగాహన సదస్సులను ఆమె ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూ గ్రామం లో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ భూమి తదితర భూ వివరాలతో విలేజ్ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికిరణ్ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన సీపీ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి : జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హైమావతిని బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో సిద్దిపేట సీపీ అనురాధ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించి కాసేపు చర్చించారు.

జూనియర్ కళాశాలలో యూనిఫాంకు

డబ్బులు వసూలు?

- సోషల్‌మీడియాలో వీడియోలు

గజ్వేల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని బాలికల జూనియర్ కళాశాలలో యూనిఫాంలకు డబ్బు వసూలు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినుల నుంచి తలా రూ.1500 వసూలు చేస్తూ రిజిస్టర్‌లో రాసుకుంటున్న ఫొటోలతో పాటు డబ్బు తీసుకునే వీడియోలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై అటు విద్యార్థి సం ఘాలు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిని సంప్రదించగా తమ దృష్టికి వచ్చిందని వసూలు చేయడాన్ని ఆపేయడంతో పాటు సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



యూనిఫాంలకు డబ్బులు వసూలు చేస్తూ రిజిస్ట్రర్‌లో రాసుకుంటున్న సిబ్బంది

పిల్లలకు ఇష్టమైన

రంగంలో ప్రోత్సహించాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్
- తమిళనాడుకు చెందిన దంపతులకు పాపను దత్తతగా అందజేత

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 18: పిల్లల భవిష్యత్‌కు బాట వేయాల్సిన బాధ్యత మీదేనని, అలాగే వారికి నచ్చిన రంగంలోనూ ప్రోత్సహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిశుగృహం నుంచి ఒక పాపను తమిళనాడుకు చెందిన దంపతులకు ఆమె అధికారికంగా దత్తతగా ఇచ్చి మాట్లాడారు. పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలోని శిశు గృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి, బాల రక్షభవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, బాలల పరిరక్షణ అధికారులు రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



పాపను తమిళనాడుకు చెందిన దంపతులకు ఇస్తున్న అదనపు కలెక్టర్

కేజీబీవీలో ఇంటర్ ఒకేషనల్ కోర్సులు

రాయపోల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలకు ఇటీవల ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ విభాగాల్లో రెండు ఇంటర్ ఒకేషనల్ కోర్సులు మంజూరయ్యాయి. కేజీబీవీ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నందున గదుల సమస్య తలెత్తింది. దీంతో ఈ ఏడాదికి గాను ఒక్కో కోర్సులో 40 మంది విద్యార్థులను తీసుకోవాల్సి ఉండగా 20 మందిని తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం తరగతులను ఎంఈవో సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు.



రామవరంలో పత్తి విత్తనాలు మొలకెత్తేందుకు ట్యాంకర్‌తో నీరు తీసుకొచ్చి నేలను తడుపుతున్న రైతులు

పత్తి రైతుల పాట్లు

- మొలకలు కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీరు

అక్కన్నపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తొలకరిలో వర్షాలు కురవడంతో పత్తి విత్తనాలు నాటిన రైతులు తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో మొలకలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. మృగశిర కార్తె పోయి పది రోజులు దాటినా వర్షాలు పడకపోవడంతో రైతులు వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఈ వానాకాలంలో పది, పదిహేను రోజుల క్రితం కురిసిన వర్షాలకు రైతులు దుక్కి దున్ని.. అచ్చు తోలి, పత్తి విత్తనాలు విత్తారు. అయితే, విత్తిన నాటి నుంచి నేటి వరకు వర్షాలు కురియకపోవడంతో విత్తనాలు వట్టిపోతున్నాయి. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన రైతు పొన్న కరుణాకర్ తన రెండెకరాల్లో పత్తి విత్తనాలు నాటాడు. వర్షాలు లేక మొలకలు ఎండిపోతుండటంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తీసుకువచ్చి నేలను తడుపుతున్నారు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 అవుతుందని, బుధవారం ఒక్క రోజే 5 ట్యాంకర్లు తీసుకొచ్చి నీటిని పోసినా, ఎకరం కూడా తడవలేదు. ఇక.. మరికొంత మంది బోర్లు, బావులు ఉన్న రైతులు స్ప్రింక్లర్లు, డ్రిప్ పైపులతో నేలను తడుపుతున్నారు. ఇంకా చాలామంది రైతులు పత్తి విత్తనాలు విత్తి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు.

పంట పైసలివ్వలే!

- పొద్దుతిరుగుడు రైతుల ఆందోళన
- రెండు నెలలు దాటిన జమకాని డబ్బు
- జిల్లాలో 4,306 మంది రైతుల నుంచి కొనుగోలు
- రూ. 32 కోట్లకు చెల్లించింది రూ. 15 కోట్లే
- వానాకాలం పెట్టుబడికి లేక రైతన్నల సతమతం

"పొద్దుతిరుగుడు డబ్బు కోసం రెండు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదు. మేమెట్లా బతకాలి" అంటూ తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన రైతు కంకణాల బాలకృష్ణ ఆవేదన చెందుతున్నాడు.

"డబ్బులు రాక వానాకాలం పంటసాగు చేయలేకపోతున్నాం. రెండు నెలల క్రితం పంట విక్రయిస్తే ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వరా.. డబ్బు కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా రేపు మాపు అంటూ తిప్పుకుంటున్నరు. మేమెట్లా బతకాలి" అంటూ మిరుదొడ్డి మండలం జంగపల్లి గ్రామానికి చెందిన రైతు కర్ల సత్తయ్య ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.

- తొగుట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా రైతన్నలు పొద్దుతిరుగుడు అమ్మిన డబ్బులను ఎప్పుడు తమ ఖాతాల్లో జమచేస్తారోనని ఆశతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆరుగాలం కష్టం చేసి పండించిన పంటను మద్దతు ధర వస్తుందనే ఆశతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే అధికారుల బాధ్యతారాహిత్యం, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల మూలంగా రెండు నెలలు దాటిన డబ్బు రాక రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 7 చోట్ల పొద్దుతిరుగుడు గింజల కొనుగోలు కేంద్రాలను మార్చి 3న అధికారులు ప్రారంభించి రైతులు నుంచి గింజలను కొనుగోలు చేశారు. వాటిని అధికారులు గోదాంలకు తరలించి చేతులు దులుపుకున్నారు.

తప్పని ఎదురుచూపు

జిల్లాలోని తొగుట, సిద్దిపేట, గజ్వేల్, చిన్నకోడూరు, హుస్నాబాద్, బెజ్జంకి, కట్కూర్ తదితర ప్రాంతాల్లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మిగతా 8వ పేజీలో



తొగుట మార్కెట్ యార్డులో రైతుల నుంచి పొద్దుతిరుగుడు గింజలను కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఆర్టీసీ చార్జీల మోత

- విద్యార్థులకు బస్‌పాస్‌ల భారం
- టోల్ పరిధిలో టికెట్ చార్జ్‌పై రూ.10 పెంపు
- హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులపై అదనపు భారం

సిద్దిపేట అర్బన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులపై మరింత భారాన్ని మోపింది. బస్ పాస్ చార్జీలను మూడేళ్లు పెంచలేదని, పెరిగిన ఖర్చుల వల్ల బస్‌పాస్ చార్జీలను పెంచుతూ ఇటీవల నిర్ణయించారు.

మహిళలకు ఫ్రీబస్ పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో విద్యార్థినులకు బస్‌పాస్ అవసరం ఉండదు. వారికి ఫ్రీ బస్ వర్తిస్తుంది. సిద్దిపేట జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లే మహిళా ఉద్యోగులకు కూడా ఫ్రీ బస్ వర్తిస్తుంది. ఇక పెరిగిన బస్ పాస్ చార్జీల వల్ల విద్యార్థులపై అదనపు భారం పడింది. బస్‌పాస్ చార్జీలతో పాటు టోల్‌గేట్ పరిధిలో ప్రయాణించే బస్సు చార్జీలపై అదనంగా రూ.10 పెరగడం ప్రయాణికులకు మరింత భారమైంది.

ఒక్కో పాస్ పై 100 నుంచి 150 పెంపు

సిద్దిపేట డిపో పరిధిలో ఏడో తరగతిలోపు చదువుతున్న విద్యార్థులు అంటే 13 ఏళ్ల లోపు ఉన్న విద్యార్థులకు ఫ్రీ బస్సు పాస్ అందిస్తున్నారు. ఏడో తరగతి నుంచి డిగ్రీ ఆపై చదువుల వరకు ఉన్న విద్యార్థులకు చార్జీ వసూలు చేస్తున్నారు. ఫ్రీ బస్ పాస్‌లు 607, స్టూడెంట్ పాస్‌లు (చార్జీలు చెల్లించాల్సినవి) 3,554 ఉన్నాయి. సిద్దిపేట నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం నిర్వహించే సీజనల్ పాస్‌లు 424 ఉన్నాయి. ఈ క్రమంలో చార్జీలు చెల్లించే బస్‌పాస్‌లకు ఒక్కో పాస్‌పై దూరాన్ని బట్టి రూ.100 నుంచి రూ.150 పెరిగినట్లు ఆర్టీసీ సిబ్బంది చెబుతున్నారు. సీజనల్ పాస్‌కు సంబంధించి సంవత్సరానికి రూ.5,900 ఉండగా ప్రస్తుతం 6,400 పెరిగింది.

అదనంగా రూ.10 పెంపు

ఆయా డిపోల పరిధి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు టోల్ గేట్ పరిధిలో వెళ్తే టికెట్‌పై రూ.10 అదనపు చార్జీని పెంచారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రూట్‌లో టోల్‌గేట్ ఉండడంతో అటుగా బస్సుల్లో ప్రయాణించే వారిపై రూ.10 అదనపు భారం పడనుంది. పెంచిన చార్జీలు టోల్‌గేట్ పరిధికి మాత్రమే వర్తిస్తాయని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నారు.



50 వేల ప్రయాణికులు

టోల్‌గేట్, బస్‌పాస్ చార్జీలు పెరగడం వల్ల ఇటు విద్యార్థులపై అటు ప్రయాణికులపై అదనం భారం పడనుంది. సిద్దిపేట డిపో పరిధిలో రోజువారీగా సుమారు 50 వేల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఇందులో హైదరాబాద్ రూట్‌లో రోజువారీగా సుమారు 10వేల మంది ప్రయాణిస్తుంటారు. అంటే రోజువారీగా ప్రయాణికులపై సుమారు రూ.లక్ష భారం పడుతుంది. విద్యార్థుల పాసులపై సుమారుగా రూ.3,55,400 సీజనల్ పాసులపై సంవత్సరానికి రూ.2.12లక్షల వరకు భారం పడనుంది.

కేటుగాళ్ల దందా

● ఫాంహౌజ్‌లు, హోటళ్లు, పల్లెల్లో జూద నిర్వాహకులు
● మందు, విందు.. జల్సాలకు ప్రత్యేక ఏర్పాట్లు
● అన్ని సమకూర్చి ఎంచక్కా కమీషన్ వసూలు



సంగారెడ్డి క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. రోజూ రూ.కోట్ల లావాదేవీలు కొన సాగుతున్నాయి. ఉద్యోగులు, పలువురు రాజకీయనేతల, నాయకులు, వ్యాపారులు పెద్ద మొత్తంలో డబ్బు పెట్టి పేకాట ఆడుతున్నారు. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట ప్రాంతాల్లో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, హోటళ్లలో కొందరు కేటుగాళ్లు దర్జాగా పేకాట శిబిరాలను ఏర్పాటు చేసే కమీషన్ దందాను కొనసాగిస్తున్నారు. నిర్వహకులు పేకాటరాయుళ్లకు కావల్సినవన్నీ సమకూర్చి కమీషన్‌ను వసూలు చేసుకుంటున్నాడు.

ఫాంహౌజ్‌లలో గుట్టుగా

సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంతాల్లోని ఫాంహౌజ్‌లను అడ్డాగా చేసుకొని పేకాట జూదాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. వీకెండ్ పార్టీల పేరిట సంబరాలు చేసుకుంటున్నామని చెబుతూ గుట్టు చప్పుడుగా పేకాట కొనసాగిస్తున్నారు. అయితే పేకాటలో భాగంగా మద్యం, గంజాయి వంటివి సేవిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. పేకాట రాయుళ్లకు నిర్వాహకులే ఇవన్నీ సమకూరుస్తున్నారు. పేకాటలో ప్రతి ఆటకూ నిర్వాహకులు కేటు(కమీషన్) వసూలు చేస్తారు. పట్టణ ప్రాంతాల్లోని ఉద్యోగులు, వ్యాపారులు పేకాట మత్తులో పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా కర్నాటకకు సరిహద్దులో ఉండటంతో అనేక మంది పేకాట ఆడటం కోసం అక్కడికి పరుగులు తీస్తున్నారు. శని, ఆదివారాలు వచ్చిందంటే చాలు పేకాట రాయుళ్ల వాహనాలన్నీ అటువైపే వెళ్తుంటాయి.

పోలీసుల దాడులు నామమాత్రమే

జిల్లాలో పేకాట జోరుగా సాగుతున్నప్పటికీ పోలీసుల తనిఖీలు మాత్రం నామమాత్రంగానే కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని సార్లు తప్పని పరిస్థితుల్లో తనిఖీలు చేసి పేకాట రాయుళ్లను పోలీసులు పట్టుకున్నా రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వదిలివేస్తున్నారని విమర్శిస్తున్నారు. అంతేగాక పలువురు ప్రముఖులు పేకాట ఆడుతూ పట్టుబడితే వారి నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకొని వారి పేర్లను ఎఫ్ఐఆర్‌లో లేకుండా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మంత్రులు, రాజకీయ నాయకులు ఫోన్లు చేసి ఫలానా వారిని వదిలివేయాలని చెబితే ఎలాగైనా వదిలేయాల్సిందేనని, అయితే ముందుగానే తాము రాజీ కుదుర్చుకొని వదిలివేస్తే ఎంతో కొంత లాభం ఉంటుంది కదా? అనే దోరణిలో కొందరు పోలీసులు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



మునిపల్లి మండలం మేళాసంఘంలో పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు(ఫైల్)

ఎంతటి వారైనా కేసులు తప్పవు



జిల్లాలో పేకాటపై ఉక్కుపాదం మోపుతున్నాం. పేకాట ఆడుతూ దొరికితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. కేసులు నమోదు చేస్తాం. జూదం ఎక్కడ ఆడుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదా 100 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి.

-పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ

360 కింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం

అల్లాదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 360 క్వింటాళ్ల రేషన్ బియ్యం లారీని పట్టుకున్నట్లు అల్లాదుర్గం ఎస్సై డి. శంకర్ బుధవారం తెలిపారు. మంగళవారం అల్లాదుర్గంలోని 161వ జాతీయ రహదారి పై వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానం వచ్చి తనిఖీ చేయగా అందులో రేషన్ బియ్యం(దొడ్డువి) ఉన్నట్లు గుర్తించామన్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్న ఈ బియ్యం పై పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించగా టెక్నికల్ అసిస్టెంట్ పవన్ ఈ బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్ బియ్యం అని నిర్ధారించారన్నారు. దీంతో పౌరసరఫరాల శాఖ సీహెచ్ నాగరాజు,జూనియర్ అసిస్టెంట్, డీసీఎస్‌వో ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ చందన్ బాయ్, ఖర్పుబాయి, లారీ యజమాని రాజురాథోడ్ పై కేసు నమోదు చేసి, పట్టుబడిన ఈ 360 క్వింటాళ్ల బియ్యంను పౌరసరఫరాల అధికారులకు అప్పగించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.



రెండు కేసుల్లో నలుగురికి జీవిత ఖైదు

● హత్య కేసులో ఒకరికి..
● వరకట్నం కేసులో భర్త, అత్తా మామలకు..

చేగుంట/కొండపాక/సంగారెడ్డి క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో నలుగురు దోషులకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర బుధవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం.. అప్పు ఇచ్చిన పాపానికి హత్యకు గురైందో మహిళ. కంది మండలం మక్త అల్లూరు గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి టైలరింగ్ పని చేసుకుంటూ జీవించేది. అదే గ్రామానికి చెందిన పట్లోళ్ల రమణ అలియాస్ రమేష్‌కు అప్పు ఇచ్చింది. ఈ అప్పు తిరిగి ఇవ్వాలని భాగ్యలక్ష్మి అడగ్గా ఆమెను హత్య చేస్తే అప్పు తిరిగి ఇవ్వాల్సిన పని లేదని భావించాడు రమణ. ఈ క్రమంలో 2018 జూలై 20న భాగ్యలక్ష్మికి ఫోన్ చేసి పశువుల కొట్టానికి పిలిచి అక్కడ ఆమె గొంతు నులిమి చంపి ఉరివేసుకొని చనిపోయినట్లుగా చిత్రీకరించాడు. సంగారెడ్డి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి, కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలు కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో దోషి పట్లోళ్ల రమణ అలియాస్ రమేష్(55)కు జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

వరకట్నం కేసులో

వరకట్నం కేసులో భర్త, అత్తామామలకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ జిల్లా 2వ అదనపు న్యాయాధికారి డా.పి.కృష్ణార్జున్ బుధవారం తీర్పు చెప్పారు. రాయికోడ్ మండలం సింగీతం గ్రామానికి చెందిన సమీనాబేగంకు అదే గ్రామానికి చెందిన బుక్కా జాఫర్‌తో వివాహం జరిగింది. రెండేళ్ల తర్వాత అదనపు కట్నం తేవాలని భర్త బుక్కా జాఫర్, మామ సయ్యద్ మొయినుద్దీన్, అత్త బుక్కా జహీరాబీలు కలిసి సమీనాబేగంను శారీరకంగా, మానసికంగా వేధించారు. దీంతో 2018 అక్టోబరు 10న సమీనాబేగం విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకున్న రాయికోడ్ పోలీసులు పూర్తి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో బుక్కా జాఫర్(24), బుక్కామొయినుద్దీన్ (68), బుక్కా జహీరాబీ (60)లకు జీవిత ఖైదుశిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో మూడు నెలల జైలు శిక్ష విధించాలని ఆదేశించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించినందుకు

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి ఒక సంవత్సరం జైలు, రూ. 25వేల రూపాయల జరిమానా విధిస్తూ సిద్దిపేట జిల్లా ఫస్ట్ అదనపు డిస్టిక్ జడ్జి జయప్రసాద్ తీర్పు చెప్పినట్టు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపాడు. అందుకు సంబంధించిన వివరాలను ఎస్సై వెల్లడించారు. కొండపాక మండలం దమ్మకపల్లి గ్రామానికి చెందిన వెలికట్ల అనిల్ (35) 2022 ఆగస్టు మూడో తేదీన ఒక గ్రామంలో నేరస్థుడు ఓ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. . ఈ విషయంలో బాధితురాలు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పుష్పరాజ్ ఫోక్సో కేసు నమోదు చేసుకొని పరిశోధన చేపట్టారు. నేరస్థుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. అదనపు డిస్టిక్ జడ్జి జయప్రసాద్ ఇరువురి వాదనలు విన్న తర్వాత నిందితుడిపై నేరం రుజువైనందున ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష 25వేల రూపాయల జరిమానా విధించారు.

చేగుంటలో

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి మూడేళ్ల జైలుతో పాటు రూ. వెయ్యి జరిమారా విధిస్తూ జిల్లా ప్రధాన సెషన్స్ ఫోక్సో కోర్టు జడ్జి జి. నీలియ బుధవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్పీ జీవీ క్షనివాస్ రాజు కథనం ప్రకారం.. 2019 లో ఆరేళ్ల బాలిక తన సోదరుడితో ఆడుకుంటూ ఉండగా, కోనేటి రాజు అనే వ్యక్తి పల్లీలు ఇస్తానని చెప్పి బాలికను ఇంట్లోకి తీసుకు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. నిందితుడిపై విచారణ జరిపి చట్టరీత్యా చర్య తీసుకొని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా అట్టి నేరాన్ని విచారించి అప్పటి తూప్రాన్ డియస్పి శ్రీ. కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి నేరస్థుడిని కోర్ట్‌లో హాజరు పరుచగా ప్రస్తుత నార్సింగి ఎసై అహ్మద్ మోహిద్దీన్ సాక్షులను ప్రవేశపెట్టారు.కేసు విచారించిన న్యాయాధికారి బుధవారం నిందితుడేన కోనేటి రాజుకి 3 సంవత్సరాల జైలు శిక్ష , వేయి రూపాయల జరిమానా విధించారు.

'బైండోవర్' ఉల్లంఘనలో బెల్లం వ్యాపారికి ..

●రూ. 50 వేల జరిమానా

హుస్నాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ నిబంధన ఉల్లంఘించినందుకు హుస్నాబాద్ పట్టణానికి చెందిన కవిత ట్రేడర్స్ యజమాని చెప్యాల వెంకటేశ్ అనే బెల్లం వ్యాపారికి బుధవారం తహసీల్దార్ లక్ష్మారెడ్డి రూ. 50 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. వెంకటేశ్‌ను గతంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గుడంబా తయారీకి ఉపయోగించే బెల్లం, పటిక సరఫరా చేసిన సంఘటనలో స్టేషన్ ఘనపూర్ పరిధిలో ఒక కేసు, హుస్నాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్లం లారీ కేసులో నిందితుడిగా ఉండి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఈ జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

ఐడీఏబొల్లారం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడలో ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఐడీఏబొల్లారంలో రోడ్లపక్కన వ్యర్థాలు తొలగించారు. ఆయన మాట్లాడుతూ తడిపొడి చెత్త వేరు చేసి ఎరువుగా వినిగించుకుంటే ఇళ్లల్లో పెరిగే మొక్కలకు ప్రయోజనకరంగా మారుతుందని తెలిపారు.





ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య..

హవేళిఘణపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని జక్కన్నపేట గ్రామానికి చెందిన తిమ్మాయిపల్లి శంకర్ గౌడ్ (41) వ్యవసాయంతో పాటు ఆటో నడుపుతూ జీవించేవాడు. కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణానికి అప్పులు చేశాడు. ఎంత పని చేసినా అప్పులు తీరడం లేదని ఇంక ఏవిధంగా తీర్చాలేనని మనోవేదనకు గురై ఈ నెల 16న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే మెదక్‌లోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ హస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. శంకర్ తల్లి రోషమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

అడవి పందిని తప్పించబోయి..

రామాయంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అత్తగారింటికి వెళ్తున్న ఓ యువకుడు అడవి పందిని తప్పించబోయి బైక్ అదుపుతప్పగా.. చెట్టును ఢీ:కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ దుర్ఘటన రామాయంపేట మున్సిపల్ శివారులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామయంపేటకు చెందిన దేవుని రాజేందర్(27) అత్తగారిల్లు అయిన ఇదే మండలం సుతార్ పల్లి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఒక్కసారిగా అడవి పంది అడ్డు వచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందకు వెళ్లి చెట్టును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్నారని దాడి

పటాన్‌చెరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఇరువురిని బంధించి దాడి చేసిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ అందించిన కథనం ప్రకారం.. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామానికి చెందిన మహిళ వివాహం జరిగింది. భార్య భర్తలు ఇరువురి మధ్య గొడవలు రావడంతో ఆమె పుట్టింట్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆమెకు రుద్రారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం శ్రీనివాస్ భార్యకు తెలియడంతో పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో అక్కడ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ నేపథ్యంలో వెలమల గ్రామానికి చెందిన అశోక్, వినయ్, రజిని తదితరులు శ్రీనివాస్, అతడిత వివాహేతర సంబంధం ఉన్న మహిళను వెలిమెల గ్రామానికి తీసుకెళ్లి గుడిలో బంధించి వారిపై తీవ్రంగా దాడి చేశారు. సమాచారం అందుకున్న బీడీఎల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని విడిపించి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను చంపేందుకు భర్త యత్నం

శివ్వంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భార్యను భర్త చితకబాది ఇంట్లో ఉరివేసి చంపేందుకు యత్నించగా స్థానికులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన బుధవారం శివ్వంపేటలో జరిగింది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం మండల కేంద్రమైన శివంపేటకు చెందిన ఓ వివాహిత (41) ని భర్త కుటుంబ కలహాలతో మద్యం మత్తులో ఇంట్లో చితకబాది ఉరి వేశాడు. చుట్టుపక్కల వారు గమనించి పుట్టింటి వారికి సమాచారం చేరవేసి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో భార్యను చంపేందుకు ప్రయత్నించాడని బంధువులు ఆరోపించారు.

మహిళ అదృశ్యం

జహీరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండంలోని హుగ్గెల్లి గ్రామానికి చెందిన నాగరాణి అనే మహిళ ఈనెల 9న అదృశ్యమైందని జహీరాబాద్ రూరల్ ఎస్సై కాశీనాథ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం నాగరాణికి ఆరు సంవత్సరాల క్రితం కర్ణాటకలోని మన్నెక్కెల్లి గామానికి చెందిన సునిల్‌తో వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల నాగరాణి తల్లిగారి గ్రామమైన హుగ్గెల్లికి వచ్చింది ఈ నెల 9న జహీరాబాద్‌లో పిల్లవాడికి పుస్తకాలు తెస్తానని చెప్పి ఇంట్లో చెప్పి వెళ్లింది. ఆరోజు నుంచి ఇప్పటివరకు కనిపించకుండ పోయింది. దీతోట కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికినీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ ఎక్కడైనా కనిపిస్తే 8712661847, 8712656764, 8712656731 నెంబరు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

27 గ్రాముల గంజాయి పట్టివేత

చిన్నశంకరంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలంలోని బుధవారం రామాయంపేట సర్కిల్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నరేందర్ మాట్లాడుతూ నమ్మదగిన సమాచారం మేరకు మండల కేంద్రంలోని పలు పరిశ్రమలు, ఖాజాపూర్ గ్రామ శివారు మరో పరిశ్రమ కాలనీలో దాడులు నిర్వహించగా, పరిశ్రమలో లేబర్‌గా పని చేస్తున్న రాజ్‌దేవ్ సింగ్ అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నాడు. దీంతో అతని వద్ద 272 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈదాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ విజయ సిద్దార్థ, హెడ్ కానిస్టేబుల్ దుర్గారెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం

●తప్పిన ప్రాణహాని



గ్యాస్ లీకై కాలిన ఇంటిని పరిశీలిస్తున్న గిర్దవార్ అశ్విన్

కోహీర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ లీకై ఇంటి పైకప్పుతో పాటు వంట సామగ్రి, తిండిగింజలు కాలిపోయాయి. గ్రామస్థుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన పోచారం భాగప్ప ఇంట్లో అతని భార్య రుక్కమ్మ వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ ఆన్ చేసి అగ్గిపెట్టె కోసం వెతకగా అగ్గిపెట్ట దొరకలేదు. దీంతో ఆమె పక్క ఇంటి నుంచి అగ్గిపెట్టె తీసుకువచ్చేందుకు బయటకు వెళ్లింది. ఈ బయటకు వెళ్లి నామే తొందరగా తిరిగి రాకపోవడంతో అప్పటికే రెగ్యులేటర్ ఆన్ చేసి ఉంచడం వల్ల ఇల్లు మొత్తం నిండిపోయింది. తర్వాత ఆమె అగ్గిపెట్టె తీసుకువచ్చి వెలిగించే సరికి ఒకేసారి ఇల్లు మొత్తం మంటలు అంటుకోవడంతో రుక్కమ్మ, ఆమె భర్త భయపడి బయటికి పరుగులు తీశారు. దీంతో ఇంట్లో ఉన్న వంట సామాగ్రి, తిండి గింజలు, ఇంటి పైకప్పు కాలిపోయింది. దాదాపు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న గిర్ధవార్ అశ్విన్ గ్యాస్ లీకై కాలిన ఇంటిని పరిశీలించారు.

సైబర్ మోసం.. రూ. 2. 26 లక్షలు మాయం

శివ్వంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి సైబర్ నేరస్థుడికి చిక్కి డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన ఎదుల్లాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామానికి చెందిన మేకల చంద్రశేఖర్ రెడ్డికి టెలిగ్రామ్ యాప్‌లో ఒక లింకు వచ్చింది రూ. 5 వందలు పెడితే రెండింతలు డబ్బులు వస్తాయని నమ్మి మొదటగా కొద్దికొద్దిగా డబ్బులు పెట్టడంతో తిరిగి వచ్చాయి. అదే నమ్మకంతో తర్వాత పెట్టిన డబ్బులు రాకపోవడంతో 2 లక్షల ఇరవై ఆరు వేల రూపాయలు పోగొట్టుకున్నాడు. చివరకు మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే స్పందించి సైబర్ నేరస్థుడి అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టగా 18 వేల రూపాయలు సేవ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తుల నంబర్ నుంచి లింకు గాని ఫోన్ గాని వచ్చినా ఓటీపీ షేర్ చేయవద్దని వెంటనే 1930 సైబర్ నెంబర్‌కు ఫోన్ చేస్తే డబ్బులు నష్టపోకుండా ఉంటుందని ఎస్ఐ సూచించారు.

వాగు దాటితేనే.. తాగునీరు

● వంతెనలు నిర్మించేదెన్నడో?

● ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటుతున్న ప్రజలు



మహ్మదాపూర్-ఉమ్మాపూర్ వాగు దాటుతున్న రైతులు(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వచ్చిందంటే చాలు హుస్నాబాద్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు, ముఖ్యంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగులు పొంగిపొర్లడంతో మహ్మదాపూర్-ఉమ్మాపూర్, కూచనపల్లి-మాలపల్లి, తోటపల్లి-గుడిబంద పూసలతండా తదితర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగులు దాటాల్సిన దుస్థితి నెలకొంది. గుట్టలపైన ఉన్న మిషన్ భగీరథ పంప్‌హౌస్‌కు వెళ్లే పంప్ డ్రైవర్లు ఈ వాగులను దాటితేనే హుస్నాబాద్ నియోజకవర్గంలోని 8 మండలాలకు తాగునీరు సరఫరా అవుతుంది. రైతులు తమ పొలాల వద్ద ఉన్న పశువుల పాలు పిండుకుని ఉదయం, సాయంత్రం తిరిగి రావడానికి కూడా ఈ వాగులను దాటక తప్పడం లేదు. వాగులపై వంతెనలు నిర్మించాలని రైతులు విన్నవిస్తున్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వంతెనలు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక రైతులు, ప్రజలు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను, అధికారులను కోరుతున్నారు.



ప్రమాదకర పరిస్థితుల్లో వాగు దాటుతున్న గ్రామస్థులు(ఫైల్)

నిధులు మంజూరయ్యాయి : మహేశ్వర్, డిప్యూటీ డీఈ

మహ్మదాపూర్-ఉమ్మాపూర్ రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు, తోటపల్లి-గుడిబంద, పూసల తండా రోడ్డు బ్రిడ్జికి రూ.4కోట్లు, చౌటపల్లి-మల్లంపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకున్న వెంటనే పనులు ప్రారంభిస్తాం.

ప్రతి పనికీ ముడుపులివ్వాల్సిందేనా?

● కార్మిక శాఖ అధికారిని నిలదీసిన లబ్ధిదారులు



సహాయ కార్మిక అధికారిని నిలదీస్తున్న లబ్ధిదారులు

నారాయణఖేడ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన కార్మిక శాఖ అధికారి లంచం డిమాండ్ చేస్తున్నారని, పనుల కోసం నెలల తరబడి తిప్పుకుంటున్నారని ఆరోపిస్తూ లబ్ధిదారులు బుధవారం నారాయణఖేడ్ సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బాధితులకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం పలికారు. ప్రభుత్వం ద్వారా కార్మికుల కుటుంబాలకు అందాల్సిన ప్రసవ ప్రోత్సాహకాల కోసం ముడుపులు అడుగుతున్నారని, కార్యాలయానికి సక్రమంగా రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు లబ్ధిదారులు ఆరోపించారు. స్కూల్ బస్సుల యజమానుల నుంచి కూడా లేబర్ లైసెన్సుల కోసం లంచం డిమాండ్ చేస్తున్నారని ప్రైవేట్ పాఠశాలల యజమానులు సైతం వాపోయారు. బాధితులు కాంగ్రెస్ నాయకులను ఆశ్రయించడంతో, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఆరిఫ్, అర్జున, క్రిష్ణ, రాజు తదితరులు కార్యాలయానికి చేరుకుని వారికి మద్దతు పలికారు. బాధితులు అనిల్ కుమార్, మహేష్, షఫీ, సుజాత, అతీక్, సంజీవ్, హన్మంతరావు, ఉమాపతి తదితరులు మాట్లాడుతూ, ప్రసవాలు, స్కూల్ బస్సులు, కార్మికుల మృతి చెందిన కుటుంబాలకు, వివాహాలకు సంబంధించిన అనేక పనుల విషయంలో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులైన కార్మిక శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై కార్మిక శాఖ అధికారి గిరిరాజ్‌ను ప్రశ్నించగా, గతంలో ఉన్న అధికారుల వల్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. తనకు అదనపు బాధ్యతలు ఉన్నందున, ఒక వారం నారాయణఖేడ్‌లో, మరో వారం హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తానని వివరించారు. దరఖాస్తు చేసుకున్న పక్షం రోజుల్లో సహాయం అందే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

ఏఐ సదస్సులో 'గీతం' ప్రాతినిధ్యం


పటాన్‌చెరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన ఏఐ సదస్సులో గీతం అధ్యాపకురాలి ప్రాతినిధ్యం వవహించారు. ఈ మేరకు గీతం వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి. లండన్ మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయంలో ఇటీవల 13వ అంతర్జాతీయ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ థియరీ అండ్ అప్లికేషన్స్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లోని సీఎస్ఈ విభాగం అధ్యాపకురాలు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ విశిష్ట అతిథిగా పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. ఈ సమావేశంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్‌లో ఎదురయ్యే సవాళ్లు, వాటి వినియోగంపై ప్రొఫెసర్ పర్వేకర్ ప్రసంగించారు.

మెరుగైన విద్యాబోధనే ధ్యేయం : కలెక్టర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్/హవేళిఘణపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నర్సింగ్ కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, సౌకర్యాలు అందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీని ఆయన సందర్శించారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు అందుతున్న బోధన, ఇతర సదుపాయాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు నూతన కాలేజీ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభం అవుతుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే హవేళిఘణపూర్ మండలంలోని మద్దుల్వాయి, హవేళిఘణపూర్ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, జిల్లా ఎలక్ట్రిసిటీ స్టోర్ల నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. స్థలాలకు డిటేయిల్ మ్యాప్ తయారు చేయాలని తహసీల్దార్ సింధూరేణుకను ఆదేశించారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్, సిబ్బంది ఉన్నారు.



నర్సాపూర్ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులు

చెంత చేరే.. చింత తీరె

● నర్సాపూర్ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు

● ప్రత్యేక గదిలో ఐదు బెడ్లతో అందుబాటులోకి...

● బాధితులకు తప్పిన వ్యయ ప్రయాసలు

నర్సాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): డయాలసిస్ చేయించుకోవడం అనేది ప్రస్తుతం చాలా మందిని పట్టి పీడిస్తున్న సమస్య. ఈ వైద్యం కోసం స్థానికంగా అవకాశం లేకపోవడంతో వేలల్లో ఖర్చు పెట్టి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. కానీ, అలాంటి అవకాశం లేకుండా నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాలసిస్ సేవలు ఉచితంగా అందిస్తుండటంతో ఈ ప్రాంతం వారికి ప్రస్తుతం ఎంతో ఉపయోగకరంగా మారింది. గత నవంబర్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐదు బెడ్లతో ప్రత్యేక గదిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ప్రస్తుతం ఈ ప్రాంతం వారికి మెరుగైన సేవలు అందిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంతానికి చెందిన 18 మంది బాధితులు పేర్లు నమోదు చేసుకుని డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఒక్కో డయాలసిస్ బాధితుడు నెలకు మూడు, నాలుగు సార్లు ఆసుపత్రికి వచ్చి డయాలసిస్ చేయించుకోవాల్సి ఉంటుంది. గతంలో ఇక్కడ డయాలసిస్ సౌకర్యం లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లి వేల రూపాయలు ఖర్చు పెట్టుకుని వ్యయ ప్రయాసాలు పడి చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం స్థానికంగానే డయాలసిస్ సేవలు లభిస్తుండడంతో నెలకు ఐదు నుంచి పదివేల రూపాయల వరకు ఖర్చు ఆదా అవుతుంది. పైగా ప్రైవేటు ఆసుపత్రులలో డయాలసిస్ ఏ మేర నాణ్యత పాటిస్తారో కూడా తెలియని పరిస్థితి. ఒక్కోసారి అవసరమయ్యే ఇంజెక్షన్ కూడా వేలల్లో ఉంటుంది, ఆ ఇంజెక్షన్ కూడా ఇక్కడ ఉచితంగానే ఇస్తుండటం విశేషం. డయాలసిస్ కేంద్రంలో ఐదు బెడ్లు, ఇద్దరు టెక్నీషియన్స్‌తో పాటు మరో ఇద్దరు సిబ్బంది డాక్టర్ల పర్యవేక్షణలో ప్రస్తుతం రెండు షిఫ్టుల పద్ధతిన కొనసాగుతోంది. డయాలసిస్ రోగులు మరింతగా పెరిగితే అదనంగా మరో టెక్నీషియన్‌ను కూడా నియమించి మూడు షిఫ్టులలో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఇక్కడి వైద్యులు పేర్కొంటున్నారు.

సద్వినియోగం చేసుకోండి..



ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు ఎలా ఉంటాయో అని అపోహ పడొద్దు. ఇక్కడ ప్రైవేటు కంటే మెరుగైన సేవలు అందిస్తున్నాం. దూరంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి డబ్బులు, సమయం వృథా చేసుకోకుండా ఇక్కడి సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

- డాక్టర్ పావని, సూపరింటెండెంట్

సర్వీసు రోడ్డు విస్తరణకు అడ్డుగా ప్రార్థనా మందిరం

● సుల్తాన్‌పూర్‌లో స్థలాన్ని పరిశీలించిన అధికారులు

● ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు

పుల్కల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కంది మండలం మామిడిపల్లి వద్ద 65 జాతీయ రహదారి నుంచి ఎస్ఎన్ఏ 162 రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించారు. పనులు పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా, సుల్తానాపూర్ గ్రామం వద్ద ప్రార్థనా మందిరం రహదారి సర్వీసు రోడ్డు విస్తరణకు పూర్తిగా అడ్డుగా మారింది. పనుల సమయంలో ప్రార్థనా మందిరాన్ని తొలగించకుండా అడ్డుకోవడంతో కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీని వల్ల తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణ నష్టం జరుగుతోంది. ఈ విషయంపై రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రత్యేక చొరవ తీసుకుని పోలీసు, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డు అధికారులతో పలుమార్లు సమీక్షించారు. సుల్తానాపూర్ వద్ద నెలకొన్న సమస్యతో పాటు తాడ్దానిపల్లి చౌరస్తా, శివంపేట గ్రామాలలో ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే అధికారులు సుల్తానాపూర్, శివంపేట గ్రామాలలో ఫ్లైఓవర్ వంతెనల నిర్మాణానికి అందుబాటులో ఉన్న స్థలాలను బుధవారం పరిశీలించారు. అందోల్-జోగిపేట ఆర్డీఓ పాండు, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, వక్ఫ్ బోర్డు కార్యనిర్వహణ అధికారి ఇబ్రహీంలతో కూడిన బృందం ప్రార్థనా మందిరం వద్ద సమీక్ష నిర్వహించింది. ఫ్లైఓవర్లు నిర్మిస్తే ఎంత స్థలం మిగులుతుంది, సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయవచ్చా లేదా అని పరిశీలించారు. ప్రార్థనా మందిరాన్ని తొలగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఇప్పటికే అక్కడ హిందూ, క్రైస్తవ మందిరాలను జాతీయ రహదారి విస్తరణలో తొలగించారు.



సుల్తాన్‌పూర్‌లో రహదారి విస్తరణ అంశంపై సమాలోచన చేస్తున్న ఆర్డీవో పాండు, డీఎస్పీ సత్తయ్య, వక్ఫ్ బోర్డు ఈవో ఇబ్రహీం

ప్రభుత్వానికి నివేదిస్తాం..

అందోల్-జోగిపేట ఆర్డీఓ పాండు మాట్లాడుతూ, మరో రెండు, మూడు సమీక్షా సమావేశాలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఏ వర్గానికి అన్యాయం జరగకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఈవో మీర్ మున్వర్ అలీ, తహసీల్దార్ సంధ్యారాణి, నాయబ్ తహసీల్దార్లు అనుదీప్, శ్రీనివాస్‌గౌడ్, సర్వేయర్ ప్రభాకర్, జోగిపేట సీఐ అనిల్‌కుమార్, పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, వక్ఫ్ బోర్డు నాయబ్ తహసీల్దార్ అసిఫ్‌ఖాన్, ఏరియా ఇన్‌స్పెక్టర్ సాబెర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. శివంపేట వద్ద ఫ్లైఓవర్ వంతెనను గ్రామానికి దగ్గరగా నిర్మించాలని ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు అలీం అధికారులను కోరారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్ ప్రావీణ్య



జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్రాకు పూల మొక్కను బహూకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నూతన కలెక్టర్ ప్రావీణ్య బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను బహూకరించారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలు చేసే న్యాయ సహాయ కార్యక్రమాలపై ఇరువురు చర్చించుకున్నారు.

రాష్ట్ర స్థాయి సదస్సుకు సింగన్నగూడ టీచర్



క్రాంతి కుమారి

ములుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సలహా కమిటీ ఆధ్వర్యంలో జూన్ 19(నేడు)న నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో ఉత్తమ బోధనా పద్ధతులతో విద్యాభివృద్ధి బలోపేతంపై మేధో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు సిద్దిపేట జిల్లా ములుగు మండలం సింగన్నగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు క్రాంతికుమారి ఎంపికయ్యారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన క్రాంతికుమారి వినూత్న బోధనా కార్యక్రమాల ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్న తీరును వివరించడానికి ఆహ్వానిస్తూ విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఉత్తర్వులు జారీ చేశారు.

భూ సమస్యలపై దరఖాస్తుల వెల్లువ

● తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు



తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పిస్తున్న రైతులు

వెల్దుర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులు గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించినప్పటికీ రైతులకు తిప్పలు తప్పడం లేదు. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు హాజరు కాలేని రైతులు గత రెండు, మూడు రోజులుగా వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తులు ఇవ్వడానికి రావడంతో కార్యాలయం రైతులతో కిటకిటలాడుతోంది. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సమాచారం సరిగ్గా లేక కొంత మంది, మరికొంత మందికి వీలు లేక కార్యాలయానికి రాలేకపోయారు. అలాంటి వారు ఇప్పుడు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. తహసీల్దార్ బాలలక్ష్మి బుధవారం మాట్లాడుతూ, గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 1630 దరఖాస్తులు వచ్చాయని, గత మూడు రోజులుగా 310 మంది రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జీపీ భూమి కబ్జాపై విచారణ



కాళ్లకల్ గ్రామంలో భూ కబ్జా పై విచారణ చేస్తున్న అధికారులు

మనోహరాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కాళ్లకల్ గ్రామ పంచాయతీకి కేటాయించిన భూమిని కొందరు కబ్జా చేశారని గ్రామస్థులు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు బుధవారం డీఎల్‌పీఓ యాదయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కాళ్లకల్ గ్రామస్థులతో కలిసి విచారణ చేశారు. గతంలో సాయి సూర్య వెంచర్ (డీటీసీపీ) వారు కాళ్లకల్ గ్రామ శివారులో తమ వెంచర్‌లో సుమారు 10 శాతం భూమిని గ్రామ పంచాయతీకి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే, ఈ భూమిని కొందరు గ్రామస్థులు అక్రమంగా కబ్జా చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ఏప్రిల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. బుధవారం గ్రామస్థుల సమక్షంలో అందరి అంగీకారంతో అధికారులు విచారణ చేపట్టారు. ఇదివరకే పంచాయతీ కార్యదర్శి కబ్జాలో ఉన్న వారికి నోటీసులు ఇవ్వగా, కబ్జాదారులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు కొంత కాలం స్టే విధించింది. ఈ విషయమే అధికారులు మాట్లాడుతూ, కోర్టు స్టే గడువు ముగిసిన అనంతరం పూర్తి విచారణ చేసి తదుపరి వివరాలను గ్రామస్థులకు తెలియజేస్తామని తెలిపారు. కాళ్లకల్ గ్రామంలో గతంలో కూడా అనేక మంది రియల్టర్లు దేవాలయాల భూములు, చెరువులు, కుంటలను కబ్జా చేశారని పలు మార్లు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ విచారణలో డీఎల్‌పీఓ యాదయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ దీక్షత్, సర్వేయర్, మాజీ సర్పంచ్ నత్తి మల్లేష్, ఉప సర్పంచ్ రాజుయాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం

● మీ సేవ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

నిజాంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు కావాల్సిన సర్టిఫికెట్లలో జాప్యం జరుగుతోంది. కుల, ఆదాయ, నివాసపత్రాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మీసేవ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిజాంపేట మండలంలోని పలు గ్రామాల విద్యార్థులు సర్టిఫికెట్లు రాక, బడికి వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. అలాగే భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన విక్రయదారులు సైతం రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఇదిలా ఉంటే తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం, సర్వర్లు మొరాయించడంతో ధ్రువపత్రాల జారీలో జాప్యం ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వేచి ఉన్న విద్యార్థులు, రైతులు



తాగునీరు.. డ్రైనేజీ పాలు

పుల్‌కల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో తాగునీరు వృథాగా పోతున్నది. ప్రజల అవసరాలకు స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి సరఫరా ట్యాంకు నుంచి ఉదయం తాగునీటిని వదలాల్సిన పంచాయతీ సిబ్బంది వేళాపాళ లేకుండా వదులుతున్నారు. బుధవారం బొమ్మారెడ్డిగూడెం గిరిజనతండాలోని ఇళ్ల వద్ద పట్టపగలే తాగునీరు కుళాయిల ద్వారా వృథాగా పోయి మురుగు కాలువల్లో కలుస్తుంది. పంచాయతీ సిబ్బంది పట్టించుకోని నల్లాకు మూత ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

మున్సిపల్ కార్యాలయంలో భూ భారతి ప్రత్యేక కౌంటర్

హుస్నాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం భూ భారతి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. రైతులకు భూమి సమస్యలు, సాదా బైనామాల ద్వారా ఇతర సమస్యలు ఉన్నట్లయితే ప్రత్యేక కౌంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సిబ్బందికి చెత్త విభజనపై క్రీడలు

హుస్నాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మున్సిపల్ అధికారులు, సిబ్బందికి బుధవారం చెత్త విభజనపై క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తకు కలర్ కోడ్ డబ్బాలను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు డ్రమ్మును ఏర్పాటు చేసి ఒక్కో టీమ్‌కు మిక్స్‌డ్ వేస్ట్‌ను ఇచ్చి చెత్తను వేరు చేసి ఒక్కొక్క డబ్బాలో వేయాలని సూచించారు. ఇందులో గెలుపొందిన జట్టుకు బహుమతులు అందజేశారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

అక్కన్నపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం కేశనాయక్ తండా పంచాయతీ కార్యదర్శిపై బుధవారం గ్రామస్థులు డీఎల్పీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులైన వారికి ఇవ్వకుండా అర్హులైన వారిని మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏసీపీని కలిసిన గ్రామస్థులు

చేర్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలం అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామానికి చెందిన పలువురు బుధవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందంను కలిశారు. కొన్నాళ్లక్రితం మద్దూరు మండల పరిధిలోని రెండు గ్రామాలను చేర్యాల మండల రెవెన్యూలో విలీనం చేసినా మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. రెవెన్యూ పరంగా పోలీస్ సేవలను చేర్యాల పరిధిలో పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్పోర్ట్స్ స్కూల్ కోసం జిల్లా స్థాయికి ఎంపికైన ఎర్రవల్లి విద్యార్థులు

మర్కుక్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలకు మండల స్థాయిలో నిర్వహించిన పోటీలో జిల్లా స్థాయిలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఎర్రవల్లి విద్యార్థులు జూపల్లి భానుప్రసాద్, తాడెం సాత్విక్‌లు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట్ రాములు తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీల పరిశీలన

హుస్నాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి5) : హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరుగుతున్న స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలను బుధవారం డీవైఎస్‌వో జంగపల్లి వెంకటనర్సయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో మనీల, హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం

చిన్నకోడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(1995-96) పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఉదారతను చాటుకున్నారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్యకు రూ. 25 వేల విలువ గల సీసీ కెమెరాల కిట్టును అందజేశారు.

స్కూల్ అభివృద్ధికి అండగా..

కొమురవెల్లి,జూన్18(ఆంధ్రజ్యోతి):మండలంలోని అయినపూర్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి రసూలాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామీగౌడ్ బుధవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అంతేగాకుండా ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి

కుకునూరుపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లకుడారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిరబోయిన ప్రదీప్ పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. గజ్వేల్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి బుధవారం ప్రదీప్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆర్టీసీ బస్‌ను పునరుద్ధరించండి

కొండపాక, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వివిధ గ్రామాల నుంచి కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు నడిపిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కొండపాక ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు సిద్దిపేట డిపో మేనేజర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. పలు గ్రామాల నుంచి బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలేజీకి, మోడల్ స్కూల్‌కు వచ్చే విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కల్లుగీత కార్మికులకు పెన్షన్ ఇవ్వాలి

కోహెడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) అర్హులైన కల్లుగీతా కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మికుల రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నకిరేకొమ్ముల గ్రామంలో కల్లు గీత కార్మికుల సమస్యలపై అవగాహన సమావేశానికి హాజరై మాట్లాడారు.

పూర్తిస్థాయి పాలకమండలికి మోక్షమెన్నడో?

- ఆరు నెలలైనా అసంపూర్తిగానే కొమురవెల్లి మల్లన్న ఆలయ పాలకమండలి
- గత డిసెంబరులో 8మందితో నియామకం
- మరో ఆరుగురికి చోటు కోసం రీ-నోటిఫికేషన్ .. 40మంది దరఖాస్తు
- చైర్మన్ హోదా లేకుండానే ముగిసిన జాతర
- పదవులకు నోచుకోలేకపోతున్నామని ఆశావహుల్లో నైరాశ్యం

చేర్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రమైనప్పటికీ కొమురవెల్లి మల్లి కార్జున స్వామి దేవాలయ పాలకమండలి అసంపూర్తిగానే కొనసాగుతుంది. 14మందితో కూడిన పాలకమండలిని ఏర్పాటుచేయాల్సి ఉన్నప్పటికీ గత ఏడాది డిసెంబరు 3న కేవలం 8మందికి మాత్రమే అవకాశం కల్పించి నియమించారు. మరో ఆరుగురు సభ్యుల నియామకానికి రీ-నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ప్రత్యామ్నాయచర్యలలో జాప్యం జరుగుతుంది. నెలలు గడుస్తున్నా ప్రక్రియ కొలిక్కిరాకపోవడంతో ఆశావహులు నిరుత్సాహపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే..

చోటు కోసం పోటాపోటీ

తెలంగాణ, జానపదుల సంస్కృతికి దర్పణంగా నిలుస్తున్న మల్లన్న ఆలయంలో యేటా 3నెలలపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. ఏయేటి కాయేడు ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తుండటంతో ఆలయ పాలకమండలిలో చోటు కోసమే కాకుండా ప్రతిష్టాత్మక చైర్మన్ పదవి కోసం ఎంతోమంది ఆశించడం పరిపాటే. అయితే ఏడాదిన్నరక్రితం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో పాలకమండలి నియామకానికి చర్యలు తీసుకునే సమయంలేక నాలుగు నెలల కాలపరిమితితో ఉత్సవ కమిటీని నియమించారు.

పూర్తిస్థాయి పాలకమండలిపై సందిగ్ధం

గత సంవత్సరం ఏప్రిల్ నెలలో పదవీకాలం ముగియడంతో రెగ్యులర్ పాలకమండలి నియామకానికి చర్యలు తీసుకుంది. పదేళ్ల అనంతరం పదవులుపొందే అవకాశం రావడంతో కాంగ్రెస్‌నేతలు 80మంది కిపైగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేరచరిత్ర పరిగణన దృష్ట్యా పలువురిని తిరస్కరించారు. గత సంవత్సరం డిసెంబరు 3వతేదీన 8మంది సభ్యులను నియమిస్తూ మిగతా 6సభ్యుల నియామకానికి 20రోజులలోగా దరఖాస్తు చేసుకోవాలని అదేరోజున రీ-నోటి ఫికేషన్ జారీ చేసింది. దీంతో మొదటి దఫాలో అవకాశం పొందని వారితో పాటు మరికొందరు కలిపి సుమారు 40మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యామ్నాయప్రక్రియ పూర్తి చేసినప్పటికీ ఆరు నెలలు గడిచినా పూర్తిస్థాయి కమిటీని వెలువరచకపోవడంతో సందిగ్ధత నెలకొంది.

కనిపించని చొరవ

గతంలో కల్యాణ సమయంలో అవకాశంఉంటే రెగ్యులర్ కమిటీ, అనుకూలత లేని పక్షంలో ఉత్సవకమిటీని నియమించేవారు. వారిలో ఒక్కరిని చైర్మన్ హోదా కల్పించి జాతర కొనసాగింపచేసేవారు. కానీ ఆలయ జాతర ప్రారంభానికి ముందు రెగ్యులర్ కమిటీ నియమించినా పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో నామమాత్రంగానే కొనసాగుతున్నారు. చైర్మన్ హోదా లేకపోవడంతో రెగ్యులర్ కమిటీ నియమించినా ప్రయోజనం కానరాకుండా పోయింది. ఇప్పటికే ఆరునెలలు గడిచిపోయినా పట్టించుకున్నవారు లేకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు, ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. అధికారంలోకి వచ్చినా పదవులు మాత్రం అందడంలేదని వాపోతున్నారు. యేటా జరిగే. బ్రహ్మోత్సవాల మూడునెలల కాలంలోనే పాలకమండలికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకోనున్నప్పటికీ ప్రస్తుతం సగం కాలం గడిచిపోవడంతో ఉసూరుమంటున్నారు. స్థానిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో అధికారపార్టీ అధిష్టానం చొరవ వహించకపోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.




కొమురవెల్లి మల్లన్న ఆలయం, కొలువైన స్వామివారు

'దర్తీ ఆబా జన భాగీదారి అభియాన్' ద్వారా
గిరిజనులు లబ్ధి పొందాలి: గరీమా అగ్రవాల్



అక్కన్నపేట: కపూర్ నాయక్ తండాలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్

అక్కన్నపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దర్తీ ఆబా జన భాగీదారి అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గిరిజనులు లబ్ధి పొందాలని అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్‌తండాలో నిర్వహించిన దర్తీ ఆబా జన భాగీదారి అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 30 పథకాల పైన అవగాహన కల్పించామని తెలిపారు. వెనుకబడిన గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదువుకోవాలి

విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ అన్నారు. కపూర్‌నాయక్‌తండాలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను ఇంగ్లీషులో పేర్లు, క్లాస్, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎంఈవో గుగులోతు రంగా నాయక్ ఉన్నారు.

ఎల్లమ్మ చెరువు సందర్శన

- **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువును బుధవారం అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, డీఈ మహేష్, ఏఈ పృథ్వీ తదితరులు ఉన్నారు.

భూ భారతిలో జిల్లాలో 30వేలకు పైనే దరఖాస్తులు



జగదేవ్‌పూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జగదేవ్‌పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి ఇప్పటి వరకు 30,630 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ పేర్కొన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన సందర్శించారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారికి రసీదులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూభారతిలో వచ్చిన దరఖాస్తులను అన్నింటినీ పరిశీలించి అట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, సిబ్బంది రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

- **కోహెడ/చేర్యాల/గజ్వేల్:** కోహెడ మండలంలోని షైసంపల్లి, ఎర్రగుంటపల్లి గ్రామాల్లో తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్ర ఆధ్వర్యంలో భూ భారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న రైతులు భూ భారతి ద్వారా అన్ని సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీమ్‌రెడ్డి తిరుపతి రెడ్డి, డైరెక్టర్ దూలం శ్రీనివాస్, ఆర్ఐ ఎల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు. చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు చేపట్టగా, 178మంది దరఖాస్తులు సమర్పించినట్టు తహసీల్దారు దిలీప్ నాయక్ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గజ్వేల్ రెవెన్యూ గ్రామ సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసిల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి

శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దు



రాయపోల్: అనాజీపూర్‌లో ప్రజలకు స్థానిక ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న తొగుట సీఐ లతీఫ్

రాయపోల్/చేర్యాల/హుస్నాబాద్ రూరల్/మద్దూరు/కొమురవెల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా, రాబోయే పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని పోలీసులు అధికారులు కోరారు. బుధవారం పలు గ్రామాల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాయపోల్ మండలం అనాజీపూర్‌లో తొగుట సీఐ లతీఫ్ ఎస్ఐ రఘుపతితో కలిసి గ్రామస్థులకు స్థానిక ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గ్రామస్థులు పోలీసులకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణంరాజు ఉన్నారు. చేర్యాల మండలం గుర్జకుంట గ్రామాన్ని ఎస్ఐ నీరేశ్ బుధవారం సందర్శించి స్థానికులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎవ్వరు గొడవలకు పాల్పడకూడదని, కలిసి మెలిసి ఉండాలనిసూచించారు. సీసీ కెమెరాల వినియోగం వలన కలిగే ప్రయోజనాలపట్ల అవగాహన కల్పించారు. హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి గ్రామంలో ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాల నియంత్రణకు దోహదపడే సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. మద్దూరు మండలంలోని వంగపల్లిలో ఎస్ఐ షేక్ మహబూబ్‌అలీ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తతతో ఉండాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కొమురవెల్లి మండలంలోని కొమురవెల్లి, గౌరాయిపల్లి గ్రామాల ప్రజలకు పోలీస్ స్టేషన్ పనితీరుపై,సిబ్బంది నిర్వహించే వివిధ రకాల విధులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజు తెలియజెప్పారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

దౌల్తాబాద్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముబారస్‌పూర్ గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన బాధిత రైతు జక్కుల కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తన రెండు ఎద్దులను మేత మేసేందుకు పొలం వద్ద విడిచిపెట్టాడు. ఈ క్రమంలో అక్కడే తక్కువ ఎత్తులో ఉన్న కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలిన ఎద్దు అక్కడికక్కడే మరణించింది. కాగా గతంలో ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెవేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా వారినుంచి స్పందన కరువైందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.70వేల విలువ చేసే తన ఎద్దు మృత్యువాత పడిందని బాధిత రైతు ఆరోపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.



ఏసీపీకి మల్లన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న అర్చకులు

మల్లన్నను దర్శించుకున్న ఏసీపీ

చేర్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని బుధవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం సతీసమేతంగా సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందించి ఆశీర్వదించారు.

మంత్రి వివేక్‌ను కలిసిన పూజల



హైదరాబాద్ సచివాలయంలో మంత్రి వివేక్‌వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన పూజల హరికృష్ణ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 18: ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర భూగర్భ గనులు, కార్మిక శాఖ, ఉపాధి కల్పనశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిని బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వెంట కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పంట పైసలివ్వలే!

(5వ పేజీ తరువాయి)

క్వింటాల్‌కు మద్దతు ధరగా రూ.7,280 నిర్ణయించి జిల్లా వ్యాప్తంగా 4,306 మంది రైతుల నుంచి 45,261 క్వింటాళ్ల గింజలను కొనుగోలు చేశారు. దానికి గాను రైతులకు రూ.32 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా కేవలం రూ.15 కోట్లు మాత్రమే జమచేశారు. ఇంకా రూ. 17కోట్లు జమ చేయాల్సి ఉంది.

పంట సాగుకు పెట్టుబడి కష్టమే..

ఖరీఫ్ సాగు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా పెట్టుబడికి డబ్బు లేక రైతులు సతమతమవుతున్నారు. అప్పు సప్పు చేసి పొద్దుతిరుగుడు పంట పండించి ప్రభుత్వానికి విక్రయిస్తే రెండు నెలలుగా డబ్బు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్పులు చేసినం ఈ పంటకు ఎక్కడ అప్పు చేయాలి... ఎవరిస్తరూ అంటూ మదనపడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే తమ ఖాతాల్లో డబ్బు జమ చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

సన్న బియ్యం స్టాకు లేదట!

(5వ పేజీ తరువాయి)

షాపులకు తరలించాలంటే లారీలు, హమాలీల కొరత ఉందని బుకాయిస్తున్నారు. వీటన్నింటినీ ముందస్తుగా ఏర్పాటు చేయకపోవడం వల్లనే ఆలస్యం జరిగినట్లుగా తెలుస్తోంది.

షాపులు తెరవక ముందే క్యూలైన్లు..

కొన్ని షాపుల్లో ఇప్పటికే బియ్యం పంపిణీ పూర్తయ్యింది. డీలర్లు నూటికి నూరు శాతం స్టాకు తెప్పించి అందజేశారు. కానీ ఇంకొన్ని చోట్ల రేపుమాపు అంటూ లబ్ధిదారులను తిప్పించుకుంటున్నారు. బియ్యం స్టాకు లేదని.. గోదాముల నుంచి రావాల్సి ఉందని చెబుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసిన సందర్భాల్లో రేషన్ దుకాణాల వైపు కన్నెత్తి చూసేవాళ్లు లేరని.. ఇప్పుడేమో తాము లేచేసరికి షాపు ముందు నిల్చుంటున్నారని డీలర్లు చెబుతున్నారు. షాపుల ఎదుట సంచులు, చెప్పులను క్యూలో ఉంచుతున్నారని చెబుతున్నారు. లబ్ధిదారులు తమ పనులు మానుకుని బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. త్వరితగతిన పంపిణీ చేస్తేనే ఇటు లబ్ధిదారులకు, అటు అధికార యంత్రాంగానికి ఉపశమనం కలుగుతుంది.



హుస్నాబాద్‌లో మూసిఉన్న రేషన్‌షాపు

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి: టీపీటీఎఫ్



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన అనంతరం మాట్లాడుతున్న టీపీటీఎఫ్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీలు అరికట్టడానికి వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, బలోపేతం కోసం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ హైమావతిని కలిశారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించి మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలో అనేక ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇవ్వడం వల్ల ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు అనుమతి ఇచ్చే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకొని అనుమతించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిట్యాల విజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాకం మల్లేశం, జిల్లా కార్యదర్శి గూడూరి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతం రాయితీ

- సర్క్యులర్ జారీ చేసిన డీఈవో శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని జిల్లా విద్యాధికారి ఆదేశాలిచ్చారు. ఈ నెల 16న జరిగిన ప్రజావాణిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సొసైటీ నుంచి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని అభ్యర్థన వచ్చిందన్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని యాజమాన్యాలకు డీఈవో సర్క్యులర్ జారీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం



బంగ్లా వెంకటాపూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

గజ్వేల్ రూరల్/మద్దూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలంలోని బంగ్లా వెంకటాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ భారి సంధ్య ఆధ్వర్యంలో బుధవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 3 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో జీపీ సెక్రెటరీ జయరాములు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎంపీడీవో ఎస్. రాంమోహన్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో పుష్పలత, సెక్రటరీ మాధవ్ జాదవ్, సీఆర్పీ భార్గవి, అంగన్‌వాడీ టీచర్స్ జ్యోతి, అనురాధ, నిర్మల, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

శృంగేరి మఠంలో చండీ హోమం




పంచామృతాభిషేకం తర్వాత ప్రత్యేక అలంకరణలో శారదమాత, చంద్రమౌళీశ్వర స్వామివారు

సిద్దిపేట కల్చరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట సమీపంలోని శృంగేరి మఠంలో బుధవారం వార్షికోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని శారదామాతకు ఉదయం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణాల మధ్య చండీ హోమం కొనసాగింది .ఈ సందర్భంగా సుహాసిని పూజ నిర్వహించారు. అనంతరం చంద్రమౌళీశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. తర్వాత అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

రైతులకు అండగా కాంగ్రెస్ భరోసా



ముస్తాబాద్ చౌరస్తా వద్ద సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటూ భరోసాను అందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. రైతు బంధు డబ్బులను రైతుల ఖాతాలో జమ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద బుధవారం పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట మహేందర్, గ్యాదరి మధు, గయాజుద్దీన్, అర్షద్, సలీం, ఫయాజ్, అనిల్, పవన్, విఘ్నేష్, చందు, సుధీర్, నజ్జు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టాలని ఆందోళన



బేగంపేటలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

బెజ్జంకి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని మండలంలోని బేగంపేట గ్రామస్థులు రోడ్డుపై బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి బేగంపేట వరకు మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

జగదేవ్‌పూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షులు పత్తిపాటి రమణాకర్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయం వద్ద తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు సత్తర్, గజ్వేల్ వేణు, జిఎల్ నాందేవ్, దరువు అంజన్న, వరంగల్ శ్రీనివాస్, జంగిరెడ్డి, కోదాడ శ్రీను, కళాంజలి, రాజేష్, చికోడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి

కొండపాక, జూన్ 18 ఆంధ్రజ్యోతి : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తామని కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొండపాక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యవర్గం ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.